గుట్ట ఆలయ ఏఈఓగా కృష్ణ నియామకం

- రఘును బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- 'స్వర్ణగిరి ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానంలో పాల్గొన్నందుకు చర్యలు
- నమస్తే తెలంగాణ వార్తకు స్పందన

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 7 : 'స్వర్ణగిరి ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానంలో గుట్ట ఏఈఓ' అనే వార్తకు దేవస్థాన అధికారులు స్పందించారు. స్వర్ణగిరి ఆలయ ఆహ్వాన కార్యక్రమాల్లో పాల్గొన్న ఏఈఓ రఘుపై బదిలీ వేటు వేశారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న గజవెల్లి రఘు ప్రైవేట్‌కు సంబంధించిన స్వర్ణగిరి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడంపై తప్పుబడుతూ ఆయనను అంతర్గతంగా వేరే విభాగానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈఓ భాస్కర్‌రావు అంతర్గత బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రధానాలయం, శివాలయం, శాశ్వతపూజలు, డోనర్ సెల్, ప్రచార శాఖ విభాగంలో ఉన్న రఘును అన్నదానం, వ్రత మండపం, వాహనపూజలు, కొండకింద వసతి గదులు, శానిటేషన్, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, కొండపైకి వాహన ప్రవేశ రుసుం, ఆర్టీసీ బస్సుల నిర్వహణ విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ప్రధానాలయ ఏఈఓగా జె.కృష్ణను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత నెల దేవస్థాన ఏఈఓ రఘు భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయ వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావుతో కలిసి హైదరాబాద్‌లో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కాగా, నమస్తే తెలంగాణలో ఈ నెల 4వ తేదీన ప్రచురితమైంది. ఆలయ నిబంధనల ప్రకారం దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులు ఇతర ప్రైవేట్ దేవస్థాన అధికారిక కార్యకలాపాల్లో పాల్గొనే వీలులేదు. ఈ నేపథ్యంలో ఏఈఓను ఇతర విభాగానికి బదిలీ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 7 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి, భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామాలకు సాగు, తాగునీరు అందివ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో కరువు ఏర్పడడంతో పాటు వరి పంటలు ఎండిపోయాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గ్రామానికి తాగు, సాగునీరును అందించి పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, మాటూరి బాలరాజు, జిల్లా నాయకులు బొలగాని జయరాములు, రచ్చ గోవర్ధన్, మండల కార్యదర్శి వేముల భిక్షం, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

క్యామ మల్లేశం గెలుపు కోసం కృషి చేయాలి

- మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 7 : భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు.

ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా క్యామ మల్లేశానికి మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో నాయకులు చందర్‌గౌడ్, భిక్షపతి, వెంకన్న, అజీమొద్దీన్, రాంబాబు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజాపేట, ఏప్రిల్ 7 : మండలంలోని పాముకుంటలో వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శివుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. భువనగిరి చెందిన వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాపోలు నాగార్జునరెడ్డి, అర్చకులు ప్రవీణ్‌స్వామి, మాజీ సర్పంచ్ జెన్నపల్లి జ్యోతీప్రభాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ అరుణ, మాధవరెడ్డి, గంగిశెట్టి రాజు, రంగా శ్రీరాములు, భద్రయ్య, జెన్నపల్లి రాజు, బాలరాజురెడ్డి, రాంచంద్రారెడ్డి, రంగ నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొమ్మలరామారం, ఏప్రిల్ 7 : మండలంలోని మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2009-2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాల బోధించిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు భిక్షపతి, నరసింహారెడ్డి, గౌస్‌మియా, జహంగీర్, భిక్షమయ్య, రవీందర్, రాజు, సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో భక్తుల క్యూ

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు ఎటుచూసినా భక్తులే దర్శనమిచ్చారు. స్వామివారి ధర్మదర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య తిరుకల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై కల్యాణోత్సవ సేవ జరిపారు. నిత్య తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మధ్యాహ్న ఆరగింపు చేపట్టారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. సాయంత్రం సహస్రనామార్చనలు, తులసీ నామార్చనలు జరిగాయి. రాత్రి శయనోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.40,32,766 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను వైటీడీఈ ఎస్ఈ వసంతనాయక్, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈఓ భాస్కర్‌శర్మ, ఈఈ రామారావుతోపాటు సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆలయ, వైటీడీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు.



ఎండకు తాళ లేక ..

భానుడి భగభగలకు ప్రజలే ఇండ్ల నుంచి బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. అలాంటిది మూగజీవాలు తట్టుకోవడం కష్టమే. రాజాపేట మండలం కొత్తజాల గ్రామంలో ఆదివారం ఎండ తీవ్రతను తాళ లేక జీవాలు ఇలా చెట్టు నీడన సేద తీరుతూ కనిపించాయి.

-రాజాపేట, ఏప్రిల్ 7

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో బీజేపీ విఫలం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చౌటుప్పల్, ఏప్రిల్ 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదివారం ఆ పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా రైతాంగంపై నల్లచట్టాలు తెచ్చి వందల మంది రైతుల చావుకు కారణమైందన్నారు.

అలాగే ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ దాడులు చేపిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎండీ పాషా, బండారు నర్సింహ, అవ్వారి రామేశ్వరి, గోపగోని లక్ష్మణ్, దండ అరుణ్‌కుమార్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీనివాస్, గోశిక కరుణాకర్ పాల్గొన్నారు.

సత్తయ్యకు సాహిత్య సేవా పురస్కారం

అవార్డు అందుకుంటున్న సత్తయ్య

చౌటుప్పల్, ఏప్రిల్ 7 : మున్సిపాలిటీ పరిధిలోని తంగెడపల్లి హైస్కూల్‌లో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మోటె సత్తయ్యకు జిల్లా స్థాయి సాహిత్య సేవా పురస్కారం-2024 లభించింది. జిల్లా రచయితల సంఘం, భువభారతి సంయుక్తంగా క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు.

సాహిత్య, సామాజిక, కళా రంగాల్లో సత్తయ్య చేసిన సేవలకు గానూ ఈ అవార్డు దక్కింది. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపకులపతి ఎన్.గోపి చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

ప్రహరీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌బీ ప్లాంట్ యజమాని ఇమ్మడి సోమనర్సయ్య



ధ్వంసం చేసిన ప్రహరీని చూపుతున్న ఆర్‌బీ ప్లాంట్ యజమాని సోమనర్సయ్య

అడ్డగూడూరు, ఏప్రిల్ 7 : మండలంలోని కంచనపల్లి శివారులో 195 సర్వే నంబర్‌లో గల 1.36 ఎకరాల భూమికి ఏర్పాటు చేసిన ప్రహరీని కంచనపల్లికి చెందిన చేడె చంద్రయ్య మరి కొంతమందితో కలిసి జేసీబీతో శనివారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఆర్‌బీ ప్లాంట్ యజమాని ఇమ్మడి సోమనర్సయ్య ఆరోపించారు. అడ్డుకునేందుకు తన సిబ్బంది వస్తే వారిని కూడా బెదిరించినట్లు తెలిపారు.15 రోజుల క్రితం తనకు ఫోన్ చేసి రూ.50 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై చంద్రయ్యను వివరణ కోరగా.. ఈ భూమి విషయంలో కొన్నాళ్లుగా వివాదం నడుస్తున్నట్లు చెప్పారు. కోర్టుకు కూడా వెళ్లినట్లు తెలిపారు. ఇంజక్షన్ ఆర్డర్ కూడా వచ్చిందన్నారు. వాళ్లే ప్రహరీని కూలగొట్టి నేను కూలగొట్టినట్లు చెప్పడం సరికాదన్నారు. నేను రూ.50 లక్షలు అడిగినట్లు రుజువు చేస్తే నా ఆస్తులు వదులుకునేందుకు సిద్ధమని తెలిపారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 : మునుగోడు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం చౌటుప్పల్ మండలం దామెరలోని బాలాజీ గార్డెన్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్ఐ

ఎస్ఐ నాగరాజు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 7 : నేరాలు, దొంగతనాల నియంత్రణ కోసం ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ నాగరాజు సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడుతూ... వ్యాపారస్తులు రాత్రిపూట కౌంటర్‌లో డబ్బులు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు.

బీఆర్ఎస్ ఇక్కుర్తి గ్రామశాఖ అధ్యక్షుడిగా మొగులయ్య

మొగులయ్య

మోటకొండూర్, ఏప్రిల్ 7 : మండలంలోని ఇక్కుర్తి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా చొప్పరి మొగులయ్యను పార్టీ నాయకులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చామకూర అమరేందర్‌రెడ్డి, నాయకులు చల్లా విజయ్‌రెడ్డి, బోడ మహేశ్, మల్లేశ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కబీర్‌రాజ్ సాహూ(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 : మండలంలోని అంకిరెడ్డిగూడెంలో శనివారం రాత్రి ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లోని కృష్ణానగర్‌కు చెందిన కబీర్ రాజ్ సాహూ(32)స్థానికంగా మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. ఆదివారం ఉదయం చౌటుప్పల్ పోలీసులు ఇంటి తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని చౌటుప్పల్ మార్చురీకి తరలించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గుండాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా లేరు

- హామీలను నమ్మి మోసపోయామంటున్నారు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

గుండాల, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రైతుబంధు అందక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని, క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. మళ్లీ పాత రోజులు వస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా లేరని అన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి గుండాల ప్రాంతానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ తాండ్ర అమరావతీశోభన్‌బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, చేనేత సహకార సంఘం చైర్మన్ దుడుక ఉప్పలయ్య, ఎంపీటీసీ కుంచాల సుశీలాఅంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మందడి రామకృష్ణారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి, నాయకులు సుధాకర్, రంగారెడ్డి, యాదయ్య, భిక్షమయ్య, కిష్టయ్య, పరశురాములు, రమేశ్, యాదగిరి, సైదులు పాల్గొన్నారు.



సంకెళ్ల మైసమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

సంకెళ్ల మైసమ్మకు బోనాల మహోత్సవం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని ఇంద్రియాల గ్రామపరిధిలోని పచ్చర్ల బావిలో సంకెళ్ల మైసమ్మకు ఆదివారం బోనాల మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి వీర బోనం సమర్పణ, బియ్యం పోయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలం, మాజీ సర్పంచులు బండి కృష్ణ, దొడ్డి అలివేలు, ఎంపీటీసీ మొగిలిపాక యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, నాయకులు రామకృష్ణ, యాదయ్య, సాయిరాం, జంగయ్య, మల్లేశ్, గణేశ్ పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ

భువనగిరిలో నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

భువనగిరి సిటీ, ఏప్రిల్ 7 : పట్టణ కేంద్రంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కప్పగంతుల నాగశర్మ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు చందుపట్ల విశ్వేశ్వర్‌రావు ఆదివారం ఆవిష్కరించారు.

ఈ నెల 9న ఉగాది పండుగను అందరూ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఆకవర రమేశ్, భువనగిరి పట్టణ పురోహితులు మణిశర్మ, రామగిరి కోటేశ్వరశర్మ, బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సూర్యనారాయణమూర్తి, మధు, శ్రీనివాస్, పురోహితులు నారాయణ, మణికంఠశర్మ, శ్రీనివాస్‌శర్మ, రామకృష్ణశర్మ, వినయ్, వంశీ, సాకేత్‌శర్మ, పురోహితులు పాల్గొన్నారు.

పూలే జయంతి కరపత్రం ఆవిష్కరణ

భువనగిరిలో జ్యోతిరావు పూలే జయంతి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ, బీసీ ప్రతినిధులు

భువనగిరి సిటీ, ఏప్రిల్ 7: పట్టణ కేంద్రంలోని జ్యోతిరావు పూలే చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కరపత్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న నిర్వహించే పూలే జయంతిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ప్రతినిధులు మాటూరి అశోక్, డీఎల్ఎన్ గౌడ్, కొత్త బాలరాజు, ఏశాల అశోక్, మెరుగు మధు, కొత్త నరసింహ స్వామి, దేవరకొండ నరసింహచారి, రత్నపురం బలరాం, బీస్కుంట్ల సత్యనారాయణ, బాలరాజు, శివ, శ్రీశైలం, నరసింహగౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

వేములపల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు ఆదివారం బిందెలతో రోడ్డెక్కారు. మిషన్ భగీరథ నీటితోపాటు గ్రామంలో ఉన్న బోరు ద్వారా వచ్చే పైపులైన్లు పగిలిపోయి నీరు రావడం లేదని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని మాట్లాడుతూ నాలుగు రోజులుగా నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను గ్రామపంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత పెరుగడంతోపాటు గృహ అవసరాలకు నీరు లేక మరోవైపు పశువులు, జీవాలకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయన్నారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ నీటిని నిత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మొల్కపట్నంలో తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న గ్రామస్తులు